


RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక



విలేకరులు కావలెను

తెలుగు భాషపై పట్టు స్థానిక సమస్యలపై అవగాహన కలిగిన ఉత్సాహవంతులైన
యువత యువకులకు జర్నలిస్ట్‌గా పనిచేసేందుకు సదావకాశం

న్యూస్ వార్ దిన పత్రిక

నూతన ఒరవడి ప్రత్యేక కథనాలతో మీ ముందుకు వస్తున్న న్యూస్‌వార్ దిన పత్రికలో
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండల కేంద్రాలల్లో
వార్తా సేకరణకు విలేకరులు కావలెను ఆసక్తి కలవారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించండి.

94409 91979



నల్లగొండ | epaper.news war.com | బుధవారం 17, జూన్ 2026 | సంపుటి :16 సంచిక :76 | ఎడిటర్: కృష్ణారావు నటవ | పేజీలు : 4 , వెల.2.00




## బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు

# అందుబాటులో ఉంచాలి

- ధాన్యం దిగుబడిపైన సంపూర్ణ అవగాహన ఉండాలి
- రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలి
- సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలి
- పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలి
- వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..
- ఏఐని మరింతగా వినియోగించాలి..
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. ఈరోజు(మంగళవారం) హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు.


వార్త 2లో



## ఆధార్ కార్డు దుర్వినియోగంపై పిటిషన్.. కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం కోర్టు నోటీసులు

ఆధార్ కార్డుల దుర్వినియోగంపై దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా విచారణ చేపట్టింది. ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. అశ్విని కుమార్ అనే న్యాయవాది ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆధార్ కార్డు కేవలం ఐడీ ప్రూఫ్‌గా మాత్రమే వినియోగమయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

2



## టెలిగ్రామ్‌పై నిషేధం నిరర్థకం.. సైబర్ సెక్యూరిటీ రీసెర్చర్ నిసర్గ అధికారి

నీట్ పరీక్ష ముగిసేవరకూ టెలిగ్రామ్‌ను ఎవరూ వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సూచనల మేరకు పేపర్ లీక్ రిస్క్‌ను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ చర్యతో ప్రయోజనం ఉండదని సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు నిసర్గ అధికారి ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. సీబీఎస్‌ఈ ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి ఉద్దేశించిన ఓఎస్ఎమ్ పోర్టల్‌లో భద్రతా లోపాలను గుర్తించిన నిసర్గ సంచలనానికి తెరతీసిన విషయం తెలిసిందే.

2



## రాహుల్ ఓ పెద్ద జోక్, రాజకీయ పరిపక్వత లేదు.. డీఎంకే విమర్శల దాడి

లోక్‌సభలో విపక్ష నేత, తమిళనాడులో తమ మాజీ భాగస్వామి రాహుల్ గాంధీ పై డీఎంకే (ఐవీఖ) ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాహుల్ గాంధీ ఒక పెద్ద జోక్ అంటూ విమర్శించింది. విపక్షాల ఐక్యతను ఆయన దెబ్బతీశారని ఆరోపించింది. అటు ఇండియా కూటమిలో, ఇటు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రవర్తనను ప్రశ్నించింది. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల అనంతరం డీఎంకేతో పొత్తుకు కాంగ్రెస్ పార్టీ ఉద్వాసన చెప్పి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు మద్దతు తెలపడంపై డీఎంకే ఐటీ విభాగం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శలు గుప్పించింది.

2

### నాకు సీఎం రేవంత్‌రెడ్డి

## సర్టిఫికెట్ అవసరం లేదు: కిషన్ రెడ్డి



తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. దేశంలో మెట్రో రైలు ఫేజ్ 2, 3లకు ఎలా సహకరిస్తున్నామో.. హైదరాబాద్‌కూ అలాగే కేంద్రం సహకరిస్తుందని తెలిపారు

2



2

## భవానీపూర్ ఫలితాలపై హైకోర్టులో మమతా బెనర్జీ పిటిషన్

### తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి

## ఉన్నాం: కేంద్ర మంత్రి బండి సంజయ్



తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు.

వార్త 2లో

### హైదరాబాద్‌లో భారీ

## అగ్నిప్రమాదం..

### ఒక్కసారిగా మంటలు వ్యాపించి..

హైదరాబాద్,

హైదరాబాద్‌లోని మూసాపేట్ గూడ్స్ షెడ్ ప్రాంతంలో ఈరోజు (మంగళవారం) భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఎలక్ట్రానిక్ వాహనాలు నిల్వ చేసే గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాం మొత్తం దట్టమైన పొగతో కమ్ముకుపోగా, మంటలు భారీగా ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు, పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.మంటలను అదుపులోకి తీసుకురావడానికి ఫైర్ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ గోదాంలో ఎలక్ట్రానిక్ వాహనాలు నిల్వ ఉండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. ఈ ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే గోదాంలో ఉన్న సామగ్రికి భారీగా నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.





2

### పలు ప్రాంతాల్లో ఏకకాలంలో

## దాడులు.. ఈగల్ ఫోర్స్ అదుపులో 19 మంది

## ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఏసీబీ సోదాలు.. భారీగా అక్రమాస్తుల గుర్తింపు

హైదరాబాద్‌లో మరోసారి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ మల్టీజోన్–2 కొంకరి నరహరి ఇంట్లో అధికారులు తనిఖీలు చేశారు. ఆయన కార్యాలయాలు, బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 13 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. చార్మినార్‌తో సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి.సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు.



2

# ఆధార్ కార్డు దుర్వినియోగంపై పిటిషన్.. కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం కోర్టు నోటీసులు

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఆధార్ కార్డుల దుర్వినియోగంపై దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా విచారణ చేపట్టింది. ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. అశ్వినీ కుమార్ అనే న్యాయవాది ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆధార్ కార్డు కేవలం ఐడీ ప్రూఫ్‌గా మాత్రమే వినియోగమయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. పౌరసత్వం, స్థానికత, నివాస ధ్రువీకరణ పత్రంగా ఆధార్ వినియోగం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని అభ్యర్థించారు. కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులో డేట్ ఆఫ్ బర్త్‌కు ధ్రువీకరణగా ఆధార్ వినియోగం ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం చెల్లదని అన్నారు.ఆధార్ కార్డు పౌరసత్వానికి ప్రూఫ్ కాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఉప్పటికీ దుర్వినియోగం అవుతోందని అన్నారు. వయసు ధ్రువీకరణ, పౌరసత్వం, స్థానికత, స్కూలు అడ్మిషన్లు, ఆస్తుల కొనుగోళ్లు, బర్త్ సర్టిఫికేట్‌కు దరఖాస్తు వంటి సందర్భాల్లో ఆధార్ దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. దీనికి తోడుకు కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫార్మ్-6లో కూడా పుట్టిన రోజు ధ్రువీకరణ, నివాసధ్రువీకరణ పత్రంగా దుర్వినియోగం అవుతోందని అన్నారు. కాబట్టి, ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పేర్కొంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

# టెలిగ్రామ్‌పై నిషేధం నిరర్థకం.. సైబర్ సెక్యూరిటీ రీసెర్చర్ నిసర్గ అధికారి

ఇంటర్నెట్ డెస్క్: న్యూస్‌వార్ ప్రతినిధి

నీట్ పరీక్ష ముగిసేవరకూ టెలిగ్రామ్‌ను ఎవరూ వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సూచనల మేరకు పేపర్ లీక్ రిస్క్‌ను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ చర్యతో ప్రయోజనం ఉండదని సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు నిసర్గ అధికారి ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. సీబీఎస్‌ఈ ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి ఉద్దేశించిన ఓఎస్ఎమ్ పోర్టల్‌లో భద్రతా లోపాలను గుర్తించిన నిసర్గ సంచలనానికి తెరతీసిన విషయం తెలిసిందే. నిసర్గ ప్రతిభను గుర్తిస్తూ ఐఐటీ కాన్పూర్ అతడికి సీఐ3హబ్‌లో పరిశోధకుడిగా ఛాన్స్ కూడా ఇచ్చింది.టెలిగ్రామ్‌పై కేంద్రం తాత్కాలిక నిషేధం నేపథ్యంలో నిసర్గ ఎక్స్ వేదికగా స్పందించారు. పేపర్ లీక్‌లను అడ్డుకోలేని పరిస్థితి చివరకు టెలిగ్రామ్‌ను బ్యాన్ చేసే స్థితికి దారి తీసిందని వ్యాఖ్యానించారు. టెలిగ్రామ్‌పై నిషేధం అసాధ్యమని తేల్చి చెప్పారు. ప్రాక్సీలు, ఇతర సాధనాల ద్వారా ప్రభుత్వ నిషేధాలను అధిగమించే విధంగా టెలిగ్రామ్ నిర్మాణం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో అసలు టెలిగ్రామ్ లాంటి మెసేజింగ్ యాప్‌లపై నిషేధం సాధ్యమేనా? అన్న చర్చ మొదలైంది.

# రాహుల్ ఓ పెద్ద జోక్, రాజకీయ పరిపక్వత లేదు.. డీఎంకే విమర్శల దాడి

చెన్నై: న్యూస్‌వార్ ప్రతినిధి

లోక్‌సభలో విపక్ష నేత, తమిళనాడులో తమ మాజీ భాగస్వామి రాహుల్ గాంధీ పై డీఎంకే (ఐవీఖ) ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాహుల్ గాంధీ ఒక పెద్ద జోక్ అంటూ విమర్శించింది. విపక్షాల ఐక్యతను ఆయన దెబ్బతీశారని ఆరోపించింది. అటు ఇండియా కూటమిలో, ఇటు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రవర్తనను ప్రశ్నించింది. తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల అనంతరం డీఎంకేతో పొత్తుకు కాంగ్రెస్ పార్టీ ఉద్వాసన చెప్పి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు మద్దతు తెలపడంపై డీఎంకే ఐటీ విభాగం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శలు గుప్పించింది. 'రాజకీయ ఉనికి కోసం కాంగ్రెస్ పోరాడుతున్న సమయంలో మేము వారిని భుజంపై పెట్టుకుని మోసాం. కానీ కొత్త బొమ్మ రాగానే వారు మాకు హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయారు' అని రాసుకొచ్చింది. రాహుల్‌ను ఒక పెద్ద జోక్‌గా అభివర్ణించింది.

## విరుచుకుపడిన మురసోలి..

డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి' సైతం తమ సంపాదకీయంలో రాహుల్‌పై విరుచుకుపడింది. ఇటీవల జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, విపక్ష పార్టీల్లో చీలికలు తలెత్తడానికి ఆయనే కారకుడని ఆరోపించింది. విపక్షాల ఐక్యత గురించి ఉపన్యాసాలు ఇస్తూ పలు రాష్ట్రాల్లో విపక్షాల ఐక్యతను బలహీనపరుస్తున్నది ఎవరని రాహుల్‌ను నిలదీసింది. కేరళలో వామపక్షాలు సైతం రాహుల్‌పై ఇటీవల చేసిన విమర్శలను ప్రస్తావించింది. ఎన్నికల ప్రచారంలో పినరయి విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్ డిమాండ్ చేయడం, బీజేపీతో ఎల్‌డీఎఫ్ రహస్య అవగాహన కుదుర్చుకుందని ఆరోపించడంపై కమ్యూనిస్టు నేతలు నిలదీయడాన్ని 'మురసోలి' పత్రిక తమ సంపాదకీయంలో గుర్తుచేసింది. ప్రత్యర్థి బీజేపీకి బదులుగా సొంత భాగస్వామ్య పార్టీలను విమర్శించడానికే రాహుల్ ఆసక్తి చూపారనే అభిప్రాయాలకు ఆయన చర్యలు తావిస్తున్నాయని పేర్కొంది. పలు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం కోసం ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాహుల్, కాంగ్రెస్ పదేపదే పనిచేస్తున్నట్టు ఆ సంపాదకీయం ఆరోపించింది. తమిళనాడులో కూటమి బ్యానర్‌పై పోటీ చేసి, సీట్లు గెలిచిన తర్వాత డీఎంకేను కాంగ్రెస్ వంచించిందని విమర్శించింది. కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఆమోదంతోనే టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతివ్వాలని కాంగ్రెస్ శాసనసభ్యులు నిర్ణయం తీసుకున్నారని తెలిపింది. రాహుల్ గాంధీ రాజకీయ అపరిపక్వత, నిలకడలేమి కారణంగానే ఇండియా కూటమిలో లుకలుకలు ఏర్పడ్డాయని తప్పుపట్టింది. కాగా, మురసోలి సంపాదకీయంపై కాంగ్రెస్ ఇంకా స్పందించలేదు. అయితే తమిళనాడులో ప్రజాతీర్పునకు అనుగుణంగానే కాంగ్రెస్ వ్యవహరించినట్టు ఆ పార్టీ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి.

# భవానీపూర్ ఫలితాలపై హైకోర్టులో మమతాబెనర్జీ పిటిషన్

కోల్‌కతా:

తృణమూల్ కాంగ్రెస్‌లో తలెత్తిన సంక్షోభం ఆ పార్టీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తరుణంలో భవానీపూర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఆ పార్టీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ మంగళవారంనాడు సవాలు చేశారు. కోల్‌కతా హైకోర్టులో ఈమేరకు పిటిషన్ దాఖలు చేశారు. టీఎంసీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి చవిచూసిన అనంతరం మమతాబెనర్జీ హైకోర్టును ఆశ్రయించడం ఇది రెండోసారి.భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇటీవల పోటీ చేసిన మమతా బెనర్జీ అక్కడి నుంచి ఓటమిపాలయ్యారు. బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో 15,105 ఓట్ల తేడాతో ఓడిపోయారు. పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మే 4న ప్రకటించారు. బీజేపీ భారీ విజయం సాధించడంతో సువేందు అధికారి కొత్త ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు.

# బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు అందుబాటులో ఉంచాలి

**ధాన్యం దిగుబడిపైన సంపూర్ణ అవగాహన ఉండాలి**

**రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలి**

**సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలి**

**పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలి**

**వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..**

**ఏఐని మరింతగా వినియోగించాలి..**

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, న్యూస్‌వార్ ప్రతినిధి

ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. ఈరోజు(మంగళవారం)



హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.

## వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి..

వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు.

## కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి..

రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# నాకు సీఎం రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదు: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, న్యూస్‌వార్ ప్రతినిధి

తెలంగాణ అభివృద్ధిపై తమకు చిత్తశుద్ధి ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో అంశంలో బీజేపీపై బురదజల్లుతున్నారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-1కు కేంద్రం రూ.1250 కోట్లు ఇచ్చిందని గుర్తు చేశారు. దేశంలో మెట్రో రైలు ఫేజ్ 2, 3లకు ఎలా సహకరిస్తున్నామో.. హైదరాబాద్‌కూ అలాగే కేంద్రం సహకరిస్తుందని తెలిపారుమెట్రో రైలు ప్రాజెక్టు ఆపాలని తానేందుకు చెబుతానంటూ కిషన్‌రెడ్డి ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు. తాను వద్దంటే ఎక్కడా ప్రాజెక్టులు ఆగవన్నారు. తానెప్పుడూ తెలంగాణ ప్రయోజనాల కోసమే పని చేశానన్నారు. తెలంగాణలో కేంద్రం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో రూ. లక్షా 75 వేల కోట్లతో రహదారుల అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణ అభివృద్ధి తమ బాధ్యత అని ఆయన పునరుద్ఘాటించారు.తనపై సీఎం రేవంత్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ అనాలోచితంగా మాట్లాడుతున్నారన్నారు. తమకు రేవంత్‌రెడ్డి సర్టిఫికెట్ అవసరం లేదని చెప్పారు. అభివృద్ధి అంశంలో తమకు పాఠాలు నేర్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నేతలకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. తాను సీఎం రేవంత్‌కు కాదు.. ప్రజలకు జవాబుదారీని అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తాను పోరాటం చేశానని ఈ సందర్భంగా కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఢిల్లీకి రెండుసార్లు తాను వచ్చి ధర్నా చేశానన్నారు. బిల్లు ఆమోదం పొందాకే ఆమరణ దీక్షను తాను విరమించానని వివరించారు. రైల్వే స్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్.. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశానని తెలిపారు. రేవంత్ రెడ్డి కోరితేనే తాను అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు.మెట్రో విస్తరణ కోసం చురుగ్గా పనిచేయాలని.. గతంలోనే సీఎం రేవంత్‌కు లేఖ రాసిన విషయాన్ని ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. రేవంత్ అనుకుంటేనో.. నేను అడ్డుకుంటేనో ప్రాజెక్టులు ఆగవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అలా చేస్తుందేమో.. కానీ బీజేపీ మాత్రం అలా చేయదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు.

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్,

తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మెట్రో ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం కిషన్ రెడ్డికి లేదన్నారు. అర్థంలేని ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ సర్టిఫికెట్ తమకు అవసరం లేదని వ్యాఖ్యానించారు. 'సర్' విషయంలో కాంగ్రెస్ గందరగోళం చేస్తోందని మండిపడ్డారు. బంగ్లాదేశ్ వాళ్లకు ఓటు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఇతర దేశాల వారి ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని కేంద్ర మంత్రి నిలదీశారు.

## మావోయిస్టులు ఇక లేరు..

మావోయిస్టులు చివరికి సాధించింది ఏంటి అని కేంద్ర మంత్రి ప్రశ్నించారు. తుపాకీ గొట్టంతో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. అభం శుభం తెలియని మైనర్లు ప్రాణాలు కోల్పోయారన్నారు. చివరికి మావోయిస్టు సంస్థని నిషేధానికి గురయ్యేలా చేశారని వ్యాఖ్యానించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని మావోయిస్టు అగ్ర నేతలు కూడా గుర్తించారని.. కేంద్రానికి సహకరించి చాలామంది లొంగిపోయారన్నారు. మావోయిస్టులు ఇక లేరని అన్నారు. మావోయిస్టు భావజాలంతో ఏదైనా సాధిద్దాం అనే ఆలోచన ఉన్న వ్యక్తులు ఆ ఆలోచనలను విరమించుకోవాలని సూచించారు. తుపాకీ గొట్టం ద్వారా ఏమీ సాధించలేమని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు.. ఈగల్ ఫోర్స్ అదుపులో 19 మంది

హైదరాబాద్,

తెలంగాణలోని వివిధ కమిషనరేట్ల పరిధిలో గంజాయి, డ్రగ్స్ వినియోగంపై భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఈగల్ ఫోర్స్ పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా 19 మందిని ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. వారికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 14 మందికి గంజాయి పాజిటివ్, మరో వ్యక్తికి గంజాయితోపాటు డ్రగ్స్ పాజిటివ్ వచ్చింది. పట్టుబడిన వారందరూ డ్రగ్స్ వినియోగించినట్లు విచారణలో అంగీకరించారని ఈగల్ ఫోర్స్ వెల్లడించింది. వీరందరిని డీ అడిక్షన్ సెంటర్లకు తరలించామని పేర్కొంది. వీరి తల్లిదండ్రులకు సమాచారం అందించామని తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో ఈగల్ ఫోర్స్ ఈ దాడులు చేసింది. ఈగల్ ఫోర్స్15 బృందాలను ఏర్పాటు చేసి వారి సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. విచారణలో గంజాయి, డ్రగ్స్ తీసుకున్న వారి నుంచి ఈగల్ ఫోర్స్ పలు కీలక విషయాలు రాబట్టింది. గోవాలోని వగటోర్ బీచ్ ప్రాంతాన్ని ఒక ముఠా కేంద్రంగా తీసుకుని కొకైన్, ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ, హ్యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్నట్లు గుర్తించింది. వాటిని బెంగళూరు, గోవా నుంచి హైదరాబాద్‌కు రవాణా చేస్తున్నట్లు కనుక్కొంది. సినీ పరిశ్రమలోని పలువురికి వీటిని విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సాంకేతిక విశ్లేషణ ద్వారా మొత్తం 44 మంది వినియోగదారులను ఈగల్ ఫోర్స్ గుర్తించింది.డ్రగ్స్ వినియోగదారులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతోపాటు గోవాలో ఉన్నట్లు విచారణలో ఈగల్ టీం కనుక్కొంది. డ్రగ్స్ కొనుగోలు కోసం వినియోగదారులు చక్రపాణి, హర్షిత్ రెడ్డిల ఖాతాలకు రూ.3.13 లక్షలకుపైగా నగదు బదిలీ అయినట్లు గుర్తించింది. 2019 లో వీరిద్దరు ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టయినట్లు ఈగల్ టీం వెల్లడించింది.

# ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి ఇంట్లో ఏసీబీ సోదాలు.. భారీగా అక్రమాస్తుల గుర్తింపు

హైదరాబాద్,

హైదరాబాద్‌లో మరోసారి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ మల్టీజోన్-2 కొంకరి నరహరి ఇంట్లో అధికారులు తనిఖీలు చేశారు. ఆయన కార్యాలయాలు, బంధువుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో 13 చోట్ల సోదాలు జరుగుతున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. చార్మినార్‌తో సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు జరుగుతున్నాయి.సోదాల్లో భాగంగా భారీగా అక్రమాస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. ల్యాండ్ డాక్యుమెంట్‌లు, బంగారు ఆభరణాలతో పాటు రూ.1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. నరహరితో పాటు ఆయన తమ్ముడి నివాసంలో సోదాలు కొనసాగుతున్నాయి. తమ్ముడి ఇంట్లోనూ భారీగా ఆస్తులను అధికారులు గుర్తించారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న ఆస్తుల వివరాలపై అన్నదమ్ముల నుంచి వివరాలు సేకరిస్తున్నారు.ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో మల్టీ జోన్ 2 డిప్యూటీ



డైరెక్టర్‌గా నరహరి కీలక విధులు నిర్వహిస్తున్నారు. భూమి సర్వే, సరిహద్దు వివాదాల పరిష్కారం, భూమి స్వాధీనం వంటి కీలక ఉద్యోగ బాధ్యతలను ఆయన నిర్వర్తిస్తున్నారు. గతంలో రంగారెడ్డి జిల్లాకి ఏడీగా కొంకరి నరహరి పనిచేశారు. దీంతో ఆ సమయంలో కూడా భారీగా అక్రమాలకు పాల్పడినట్టు ఏసీబీ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# పెనుభారంగా ప్రైవేటు చదువులు

విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు. సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్యే పునాది. అయితే నేటి పరిస్థితుల్లో విద్య హక్కు కంటే వ్యాపారంగా మారిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు విద్యకు ప్రధాన కేంద్రాలుగా ఉండేవి. కానీ కాలక్రమేణా ప్రైవేటు విద్యాసంస్థల సంఖ్య పెరిగింది. నాణ్యమైన విద్య, ఇంగ్లీష్ మాధ్యమం, ఆధునిక సదుపాయాల పేరుతో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని కొన్ని విద్యాసంస్థలు ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల పెంపు తల్లిదండ్రులకు భారంగా మారుతోంది. ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభం కాగానే అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా ఛార్జీలు, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో వేల నుంచి లక్షల రూపాయల వరకు వసూలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడంతా జనాలు అమ్మో జూన్ నెల అనుకుంటున్నారు. ఇటు స్కూల్ ఫీజుల మోత మట్నదలైంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఏటా 10% నుండి 15% వరకు ఫీజులను పెంచుతూ తల్లిదండ్రులపై భారీ ఆర్థిక భారాన్ని మోపుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ నెలలో పాఠశాలల పునఃప్రారంభం వేళ అడ్మిషన్ల పేరుతో, పుస్తకాలు, డ్రెస్సుల పేరుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా దోచుకుంటున్నారు. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి, పొదుపులను ఖర్చు చేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలు ఉంటే ఆర్థిక ఒత్తిడి మరింత పెరుగుతోంది. కొంతమంది తల్లిదండ్రులు ఫీజులకోసం వ్యక్తిగత రుణాలు తీసుకోవాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో సగటు వార్షిక ఫీజు రూ. 41,475 దాటిపోయింది. ఇది రాష్ట్రంలోని కనీస బిటెక్ ఫీజు (రూ. 36,000) కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. గ్రామీణ ప్రాంతాల్లోనూ తక్కువ కాదు: గ్రామాల్లో సైతం సగటు స్కూల్ ఫీజు రూ. 35,104 గా నమోదవుతోంది. పట్టణాలకు, గ్రామాలకు తేడా కేవలం ఆరు వేల రూపాయలు మాత్రమే. ఎల్‌కెజి, యుకెజి చదువులకే కనీసం రూ. 30,000 నుండి రూ. 50,000 వరకు వసూలు చేస్తున్నారు. అదనపు వసూళ్ల దోపిడీ పుస్తకాలు, యూనిఫాంల దందా కనిపిస్తుంది. నిబంధనల ప్రకారం స్కూళ్లలో పుస్తకాలు అమ్మకూడదు. కానీ, ఐటిఐ ఒరియంటెడ్, ఐఐటి లేదా నీట్ సిలబస్ పేరుతో ప్రైవేట్ పబ్లికేషన్ల పుస్తకాలను రూ. 10,000 నుండి రూ. 12,000 కు విక్రయిస్తున్నారు. రవాణా, ఇతర ఖర్చులు: కేవలం ట్యూషన్ ఫీజే కాకుండా యూనిఫాం, షూస్‌కోసం రూ. 4,000, స్కూల్ బస్సు ఛార్జీల కింద నెలకు రూ. 2,000 నుండి రూ. 3,000 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. మధ్యతరగతి తలనొప్పి: జూన్ నెలలో ఇద్దరు పిల్లలున్న ఒక మధ్యతరగతి కుటుంబం కేవలం చదువుల కోసమే ఒకేసారి రూ. 1,00,000 నుండి రూ. 1,50,000 వరకు సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ప్రైవేటు పాఠశాలల ఫీజు నియంత్రణ చట్టంపై ప్రభుత్వంనుంచి సరైన స్పష్టత కరువైంది. దీని వల్ల సుమారు 11 వేల ప్రైవేటు స్కూల్స్‌లోని 32 లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ భారాన్ని మోయాల్సి వస్తోంది. పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు, ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి అనే వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలనే విద్యాశాఖ నిబంధనలను ఏ పాఠశాల పాటించడం లేదు. విద్యాసంస్థలు కూడా తమవైపు నుంచి ఫీజుల పెంపుపై కారణాలను చెబుతున్నాయి. ఉపాధ్యాయుల వేతనాలు, భవన నిర్వహణ, విద్యుత్, సాంకేతిక సదుపాయాలు, డిజిటల్ తరగతులు వంటి ఖర్చులు పెరిగాయని పేర్కొంటున్నాయి. అయితే ఈ ఖర్చుల పేరుతో అధిక ఫీజులు వసూలు చేయడం సమంజసమా అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు స్పష్టమైన విధానం రూపొందించాలి. ఫీజుల పెంపుపై పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా పెరుగుతున్న ఫీజులను నియంత్రించడానికి ప్రభుత్వం పలు కఠినమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రాష్ట్రస్థాయిలో స్వతంత్ర ఫీజు నియంత్రణ కమిషన్ ఏర్పాటు చేసి, ప్రతి పాఠశాల వసూలు చేసే ఫీజులను పరిశీలించి ఆమోదించాలి. ప్రతి సంవత్సరం ఫీజు పెంపునకు గరిష్ట పరిమితి నిర్ణయించాలి. నిర్దిష్ట శాతం కంటే ఎక్కువ పెంపు చేయాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి చేయాలి. పాఠశాలలు తమ ఫీజుల వివరాలను వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డులో, తల్లిదండ్రులకు ముందుగానే వెల్లడించేలా నిబంధనలు అమలు చేయాలి. అడ్మిషన్ ఫీజు, డొనేషన్, డెవలప్‌మెంట్ ఫండ్, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో అధిక మొత్తాలు వసూలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులు పాఠశాల సూచించిన దుకాణాల నుంచే కొనాలనే బలవంతాన్ని తొలగించి, ఎక్కడైనా కొనుగోలు చేసే స్వేచ్ఛ కల్పించాలి. జిల్లా స్థాయిలో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, తల్లిదండ్రుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలి. ప్రైవేటు పాఠశాలల ఆదాయం- వ్యయాలపై ప్రతి సంవత్సరం ఆర్థిక ఆడిట్ నిర్వహించి, నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అధిక ఫీజులు వసూలు చేసే పాఠశాలలపై జరిమానాలు విధించడం, గుర్తింపు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. మరిన్ని కనుగొనండి టెక్



ట్రెండ్స్ సేవ జాతీయ వార్తల సేవ ఎడిటోరియల్ సేవ ఫీజుల నిర్ణయంలో తల్లిదండ్రుల ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఆధునిక సదుపాయాలు, ఇంగ్లీష్ మాధ్యమం వంటి అవకాశాలను పెంచితే ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడటం తగ్గుతుంది. ఇలాంటి కఠిన చర్యలను ప్రభుత్వం తీసుకుంటేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల నియంత్రణకు ముక్కుతాడు వేసినట్టు అవుతుంది. 'విద్య వ్యాపారం కాదు.. సామాజిక బాధ్యత' అనే భావనతో ప్రభుత్వం కఠిన నియంత్రణలు అమలు చేస్తేనే ప్రైవేటు బడుల్లో ఫీజుల మోతకు అడ్డుకట్ట పడుతుంది. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక స్థితి రెండింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం,విద్యాసంస్థలు,సమాజం కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైంది.


# సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో చంద్రబాబు భేటీ

## టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఏఐపై చర్చ

## దాదాపు 30 నిముషాల పాటు ప్రధానితో బాబు భేటీ

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, పెట్టుబడులు, సాంకేతిక రంగ సహకారం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి కీలక అంశాలపైసిఎం చంద్రబాబు చర్చించారు. ఏపీ అభివృద్ధికి అవసరమైన టెక్నాలజీ, సెమీకండక్టర్లు, క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగాల్లో సహకారం అందించాలని సీఎం చంద్రబాబు సింగపూర్ ప్రధానిని కోరారు. ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ తో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సింగపూర్ ప్రధాని అధికారిక నివాసంలో సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో ముఖ్యంగా సెమీకండక్టర్ తయారీ ఎకోసిస్టమ్ అభివృద్ధి, నైపుణ్యాల పెంపు అంశాల్లో సింగపూర్ మద్దతు అవసరమని వివరించారు. అమరావతి సహా రాష్ట్రంలోని వివిధ నగరాలు, పట్టణాల్లో అర్బన్ గవర్నెన్స్, నగర ప్రణాళిక, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వామ్యం కావాలని సీఎం కోరారు. ఈ సందర్భంగా అమరావతి రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై సింగపూర్ ప్రధాని ప్రత్యేక ఆసక్తి చూపించారు. విద్యా సంస్థలు, అంతర్జాతీయ ప్రమాణాలతో చేపడుతున్న మౌలిక సదుపాయాల నిర్మాణాల గురించి లారెన్స్ వాంగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచ స్థాయి నివాసయోగ్య నగరాల సరసన నిలుస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్య రంగం అభివృద్ధి, జనాభా నిర్వహణకు సంబంధించిన చర్యలను కూడా వివరించారు. వ్యవసాయ రంగంపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. ఆంధప్రదేశ్‌లో ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయం చేస్తున్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. రాష్ట్రంలోని ఉద్యానవన, ఆక్వా ఉత్పత్తులను సింగపూర్ దిగుమతి చేసుకునే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ప్రకృతి సేద్యం ఉత్పత్తులకు అంతర్జాతీయ ప్రమాణాల సర్టిఫికేషన్, ట్రేసబిలిటీ వ్యవస్థలను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధితో పాటు వాణిజ్య, పారిశ్రామిక అవకాశాలను మరింత విస్తరించేందుకు ఆంధప్రదేశ్, సింగపూర్ కలిసి పనిచేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. రాష్ట్రం 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గుదల, అందుబాటు గృహ నిర్మాణం, శిశువులు, చిన్నారుల సంరక్షణ వంటి సామాజిక అంశాలపై కూడా ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు. సేవల రంగం తరహాలోనే తయారీ, సరఫరా గొలుసు (సప్లై చైన్) రంగాలు కూడా భారత్‌లో వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని ఇద్దరు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ ద్వారా ఆంధప్రదేశ్?సింగపూర్ సంబంధాలు మరింత బలోపేతం కావడంతో పాటు పెట్టుబడులు, సాంకేతిక సహకారం, పట్టణాభివృద్ధి, వ్యవసాయ ఎగుమతుల రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందని ఇరువురు నేతలు భావిస్తున్నారు. ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనలో భాగంగా సింగపూర్‌కి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు ప్రజలు, ప్రవాస భారతీయులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్‌లో చంద్రబాబు ఓ పోస్టు పెట్టరు. తనకు, తన బృందానికి ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి చూపించిన ప్రేమాభిమానాలు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు.




# ఫ్యూచర్ సిటీ కోసం శరవేగంగా అడుగులు

## సింగపూర్ కంపెనీకి మాస్టర్ ప్లాన్ బాధ్యతలు?

**హైదరాబాద్,**

: ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి ఇటీవలఏ అక్కడ ఫ్యూచర్ సిటీ వెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయాన్ని ప్రారంభించారు. దీనికితోడు మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేస్తున్నారు. రానున్న ఆరేడేళ్లలో ఫ్యూచర్ సిటీని అందుబాటులోకి తీసుకుని రావడం లక్ష్యంగా శరవేగంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనికితోడు కొన్న ప్రభుత్వ కార్యాలయాలను అక్కడికి తరలిస్తున్నట్లు వార్తలు వస్తున్నారు. ఇదే క్రమంలో ఫ్యూచటర్ సిటీ మాస్టర్ ప్లాన్ ఈ బాధ్యతలను సింగపూర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించినట్టు తెలుస్తున్నది. ఇందుకోసం గ్లోబల్ టెండర్లను పిలువగా.. ఆరు సంస్థలు టెండర్లలో పాల్గొన్నాయి. అందులో సింగపూర్‌కు చెందిన డీపీ ఆర్కిటెక్ట్స్ అనే సంస్థ లోయెస్ట్ బిడ్డర్‌గా నిలిచిందని సమాచారం.దీంతో ఆ సంస్థకే మాస్టర్ ప్లాన్ తయారీ బాధ్యతలను ప్రభుత్వం అప్పగించినట్టు సమాచారం. 765 చదరపు కిలోమీటర్ల మేర ఫ్యూచర్ సిటీకి ఆ సంస్థ మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నది. 9 నెలల్లో మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసి ఇచ్చేలా సంస్థకు బాధ్యతలు అప్పగించినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. తొలిదశలో భాగంగా 30 వేల ఎకరాలపై మాస్టర్ ఎ÷-లాన్‌ను సిద్ధం చేయనున్నారు. అందులో భాగంగా వేటికి ఎంత భూమి వినియోగించాలి.. మౌలికవసతుల అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యాలను ప్లాన్‌లో పొందుపరచ నున్నారు. మొత్తంగా 30 వేల ఎకరాల్లో 13 వేల ఎకరాలను మౌలికవసతులు, పారిశ్రామిక అవసరాల అభివృద్ధికి వాడుకోబోతున్నారు. డెవలప్‌మెంట్‌లో భాగంగా లైఫ్‌సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలుస్తున్నది. 13 వేల ఎకరాల్లో సింహభాగం లైఫ్?సైన్సెస్‌కు కేటాయించనున్నారు. 4 వేల ఎకరాల్లో లైఫ్‌సైన్సెస్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఆ తర్వాత 2,177 ఎకరాల్లోఎలక్ట్రానిక్స్ అండ్? అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్? జోన్‌ను అభివృద్ధి చేస్తారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ట్రెండ్, డిమాండ్ పెరగడంతో దానికీ ప్రాధాన్యం ఇచ్చారు. ఎలక్ట్రిక్ వెహికల్స్, ఎనర్జీ పార్క్ కోసం దాదాపు 2 వేల ఎకరాలు కేటాయించినట్టు తెలిసింది. ఏఐ సిటీ కోసం 400 ఎకరాలు, డేటా సెంటర్ హబ్ కోసం 310 ఎకరాలు, హెల్త్ సిటీకి 594 ఎకరాలు, ఎడ్యుకేషన్ అండ్ యూనివర్సిటీ డిస్ట్రిక్ట్ కోసం 255 ఎకరాల కేటాయింపులు చేసినట్టు చెబుతున్నారు. వాటితోపాటు రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌ల అభివృద్ధి కోసం 2,477 ఎకరాలను కేటాయించారు. మిక్స్డ్‌యూజ్‌పర్పస్‌లో ఎంటర్‌టైన్‌మెంట్, స్పోర్ట్స్, ఫర్నీచర్? మాన్యుఫ్యాక్చరింగ్‌కు కూడా భూములు కేటాయించినట్టు చెబుతున్నారు. ట్రాన్స్‌పోర్ట్ కారిడార్లు, యుటిలిటీ నెట్‌వర్క్స్, సోషల్? ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాణిజ్య ప్రాంతాలు, పర్యావరణ పరిరక్షణ ప్రాంతాలను మాస్టర్ ప్లాన్‌లో పొందు పరచనున్నారు. ప్రస్తుతం ఎఫ్?సీడీఏ ప్రాంతం వివిధ హద్దుల్లోకి వస్తున్నది. ఉత్తర భాగంలోని కొన్ని ప్రాంతాలు హెచ్‌ఎండీఏ, మధ్యభాగంలో హైదరాబాద్ ఫార్మా సిటీ ఏరియా ఉంటున్నది. దక్షిణ భాగం గ్రామీణ ప్రాంతాలే ఉన్నాయని చెబుతున్నారు. ప్లాన్ ప్రకారం సిటీ అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికను పొందుపరుస్తారని అధికారులు చెబుతున్నారు.




# అధిక జ్యేష్ఠం..ఆరంభం

## శుభకార్యాలకు అనువు కాదు

**తిరుపతి,**

ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ఆరంభమయ్యింది. అధిక మాసం అంటే అనే సందేహాలు వస్తుంటాయి. ఒకే సంవత్సరంలో ఒకే పేరున్న మాసం రెండు సార్లు వస్తే మొదటిదాన్ని అధికం అని, రెండవదాన్ని నిజమాసమని, శుద్ధం అని అంటారు. హిందూ పంచాంగం చంద్రుడి గమనాన్ని అనుసరిస్తుంది, అయితే గ్రెగోరియన్ క్యాలెండర్ సూర్యుని ఆధారంగా ఉంటుంది. చాంద్రమాన సంవత్సరం సుమారు 354 రోజులు ఉండగా, సౌర సంవత్సరం 365 రోజులు ఉంటుంది. ఈ రెండు మధ్య వచ్చే వ్యత్యాసం వల్ల ప్రతి సంవత్సరం 10,11 రోజుల తేడా



ఏర్పడుతుంది. ఈ తేడా ఒక నెలకు చేరినప్పుడు, సుమారు మూడు సంవత్సరాలకు ఒకసారి అదనపు నెలను జోడిస్తారు. దానినే అధిక మాసం అంటారు. ఇది కాలమానం సమతుల్యతను కాపాడడంలో సహాయపడుతుంది. మతపరంగా ఇది ఆధ్యాత్మిక సాధనకు అత్యుత్తమ సమయంగా భావించబడుతుంది. ఈ ఏడాది మే 17, ఆదివారం నుంచి అధిక జ్యేష్ఠ మాసం ప్రారంభం అయ్యింది. 'అసంక్రాంతి మాసో అధికమాసః' అని సనాతన ధర్మశాస్త్రంలో వివరించి ఉంది. అంటే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రయాణించడాన్ని సంక్రమణం లేదా సంక్రాతి అంటారు. ఏ మాసంలో అయితే సూర్యుడు ఒక రాశి నుంచి ఇంకో రాశిలోకి ప్రవేశించడో ఆ మాసాన్ని అధిక మాసమని అంటారు. పురాణ కథల ప్రకారం, ఈ అదనపు మాసాన్ని మొదట మల మాసం అని పిలిచేవారు. దానిని శుభకార్యాలకు అనుకూలంగా భావించలేదు. ఏ దేవుడు కూడా దీనికి అధిపతిగా ఉండటానికి ముందుకు రాలేదు. అప్పుడు శ్రీమహావిష్ణువు.. తన పేరు అయిన 'పురుషోత్తమ'ను దీనికి ఇచ్చాడు. అప్పటి నుండి ఇది 'పురుషోత్తమ మాసం'గా ప్రసిద్ధి చెందింది. ఈ మాసంలో విష్ణువును ఆరాధిస్తే అనేక రెట్లు పుణ్యఫలాలు లభిస్తాయని విశ్వాసం. చైత్రం నుండి ఆశ్వయుజ మాసం (మార్చి–అక్టోబర్) మధ్య కాలంలో ఏ నెలలో సూర్య సంక్రమణం (సూర్యుడు కొత్త రాశిలోకి ప్రవేశించడం) జరగదో, ఆ నెల అధిక మాసంగా పరిగణించబడుతుంది...మళ్ళీ 2029 సాధారణ నామ సంవత్సరంలో చైత్ర మాసము అధిక మాసం వస్తుంది..

న్యూస్ వార్
వార్తా పత్రిక

## ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా చిన్నం బాలరాజు



చౌటుప్పల్ జూన్ 16 (న్యూస్ వార్)

నేలపట్ల గ్రామ ఉప సర్పంచ్ చిన్నం బాలరాజు కురుమను తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చిన్నం బాలరాజు కురుమ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బోట్ల కార్తీక్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తూ రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, గ్రామ పంచాయతీల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం మరియు ఉప సర్పంచ్‌ల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జిగ నరేష్ కి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సుర్కంటి శ్రీధర్ రెడ్డికి, రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌లందరికి ధన్యవాదాలు తెలిపారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26000 వేలు ఇవ్వాలి

చండూర్ జూన్ 16 (న్యూస్ వార్ )

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26000వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జెర్రిపోతుల ధనంజయ అన్నారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలోని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలోమున్సిపల్ కార్మిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ఎల్. మల్లేశంకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి ప్రకటించి అమలు చేయాలని ఆయన ప్రభుత్వానికి కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దశల వారి పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందినీ, ఈనెల జూన్ 18 19 తేదీలలో మున్సిపల్ ఆఫీసుల వద్ద నిరాహార దీక్షలు చేయాలని, జూన్ 22వ తేదీన జిల్లా కలెక్టర్ ఆఫీసుల ముందు ధర్నాలు చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. జూన్ 29 30 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలు మంత్రుల ఇండ్ల ముందు ధర్నాలు చేపట్టాలని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల మంది మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు పస్తులు ఉంటూ, అర్ధాకలితో జీవితాలు గడుపుతూ, అతి తక్కువ వేతనాలను పొందుతూన్న కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2 వ పిఆర్సి ప్రకటించి 26 వేల కనీస వేతనం అమలు చేయాలని కార్మిక సంఘాలు, కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడుతుంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల ఆక్రందనలు పట్టించుకోకుండా, కనీస వేతనం 26000 పెంచకుండా కేవలం 16 వేల 600 ఇస్తూ మున్సిపల్ కార్మికుల శ్రమ దోపిడికి పాల్పడుతూ, కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితులలో మున్సిపల్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ కార్మికులు పోరాట బాట పట్టాల్సి వచ్చిందని అందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కావున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న డిమాండ్లను జిల్లా పరిధిలో ఉన్న లోకల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దప దశల వారి కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగిందని అన్నారు. జూలై 12న హనుమకొండలో జరుగు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్



సమావేశాలలో తదుపరి పోరాట కార్యక్రమం చలో హైదరాబాద్, సమ్మె గురించి చర్చించి ప్రకటించడం జరుగుతుందని, ఈ కార్యక్రమాలన్నింటిని మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని, స్థానిక సమస్యలను మునిసిపల్ అధికార వర్గం వెంటనే పరిష్కరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు మొగుదాల వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, సిఐటియు జిల్లా నాయకులు కత్తుల సైదులు, బీపంగి నాగరాజు, యాదయ్య, రేణుక,కలమ్మ, జంగమ్మ, వెంకన్నతదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంఖ్య పెంపునకు వినూత్న ప్రయత్నం

### కొత్తగా చేరే విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో ఉచిత సైకిళ్లు



మర్రిగూడ జూన్ 16 (న్యూస్ వార్)



శివన్నగూడెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంపునకు అధికారులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో 87 మంది విద్యార్థులు చదువుకోగా, అందులో 23 మంది పదో తరగతి పూర్తి చేసి పాఠశాల నుంచి నిష్క్రమించారు. ప్రస్తుతం పాఠశాలలో 64 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. రానున్న కాలంలో ప్రవేశాలు తగ్గి పాఠశాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని గుర్తించిన ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి శారద ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెంచడం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం లక్ష్యంగా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో ఉచిత సైకిళ్లు అందిస్తున్నామని తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు రాకపోకల ఇబ్బందులు లేకుండా ఈ కార్యక్రమం వల్ల విద్యార్థుల హాజరు పెరగడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) చేసే కార్యక్రమాలను విజయవంతం చేయండి

### -- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జాంగీర్



చౌటుప్పల్, జూన్ 16 (న్యూస్ వార్)

కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జాంగీర్ విమర్శించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ అమలు కాకపోగా, నిరుద్యోగం మరింత పెరిగిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని పేర్కొన్నారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ పేరుతో కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ దేశ సంపదను కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరిస్తోందని ఆరోపించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే విధానాలను బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువలపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వామపక్ష శక్తులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు ఎండి పాషా రా గీరు కిష్టయ్య పిఎన్ఎమ్ జిల్లా కార్యదర్శి ముత్యాలు మండల కార్యదర్శి వర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి తడక మోహన్ చింతల సుదర్శన్ బోయ యాదయ్య ఆదిమూలం నందీశ్వర్ పొట్ట శ్రీనివాస్ అంతటి అశోక్ జక్కిడి దేవేందర్ రెడ్డి చెరుకు లక్ష్మమ్మ కొంతం సుశీల బొడ్డు అంజిరెడ్డి తూర్పునూరు మల్లేశం మోగదాల రాములు చప్పిడి శ్రీనివాస్ రెడ్డి చికూరి ఈదయ్య బొమ్మకంటి కృష్ణ యాట బాలరాజు కొంతం శ్రీనివాస్ రెడ్డి గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి చేరిక అలివేలు ఎండి రేష్మ ఎండి ఆసియా నేరేడు మహేష్ త్రిగుళ్ల శ్రీను నిలుగొండ నరేష్ చీమకొండ శ్రీరాములు యాట ముత్యాలు జంగం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో స్కూల్ బస్సులపై రవాణా శాఖ కొరడా: 60 బస్సులు సీజ్, 245 వాహనాలపై కేసులు

విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై కొరడా ఝుళిపించింది. వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు పునఃప్రారంభమైన తొలి రోజే రాష్ట్రవ్యాప్తంగా అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ డ్రైవ్‌లో ఆర్టీఏ నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్డెక్కిన 245 పాఠశాల, కళాశాలల వాహనాలను రవాణా శాఖ అధికారులు గుర్తించారు. ఇందులో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న 60 స్కూల్ బస్సులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకున్నారు.ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా అధికారులు బస్సుల పత్రాలతో పాటు యాంత్రిక పనితీరును సైతం క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. అలాగే, డ్రైవర్ల లైసెన్సులు, వారి అనుభవం, బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అటెండెంట్ల నియామకం వంటి భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. బ్రేకులు, టైర్లు, లైట్లు సరిగ్గా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించని, సరైన పత్రాలు లేని బస్సుల విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని అధికారులు స్పష్టం చేశారు.రవాణా శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 25,987 విద్యాసంస్థల బస్సులు ఉండగా, కేవలం 23,204 బస్సులకు మాత్రమే చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయి. మిగిలిన 2,783 బస్సులు వెంటనే ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందాలని అధికారులు కఠిన ఆదేశాలు జారీ చేశారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను తీసుకెళ్లినా, ఫిట్‌నెస్ లేకుండా బస్సులు నడిపినా వాహనాల యజమానులు, డ్రైవర్లతో పాటు విద్యాసంస్థల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత విషయంలో యాజమాన్యాలదే పూర్తి బాధ్యత అని తేల్చిచెప్పారు. తమ పిల్లలను స్కూల్ బస్సుల్లో పంపే తల్లిదండ్రులు సైతం అప్రమత్తంగా ఉండాలని, పరిమితికి మించి పిల్లలను ఎక్కించే వాహనాలు లేదా నిబంధనలు ఉల్లంఘించే బస్సుల సమాచారాన్ని వెంటనే అధికారులకు తెలియజేయాలని రవాణా శాఖ సూచించింది. రానున్న రోజుల్లో కూడా ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టం చేసింది.




Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,